హైదరాబాద్ వార్త




పాతబస్తీలో పండ్లు, స్వీట్లతో అలంకరించబడిన ముత్యాలమ్మ అమ్మవారు



# పరిహారంలో పరిహాసం

**గ్యాస్‌బీమా అందడంలో నిర్లక్ష్యం**

**వినియోగదారులకు అవగాహన కల్పించని కంపెనీలు**

**తూతూమంత్రంగానే సమావేశాలు నిర్వహిస్తున్న డీలర్లు**

**గ్యాస్‌బీమా ఉందని తెలియక నష్టపోతున్న వినియోగాదారులు**



హైదరాబాద్, జూలై 14,(ప్రభాతవార్త): గ్యాస్ కనెక్షన్ తీసుకున్న ప్రతిఒక్కరికీ ఏదైనా ప్రమాదం సంభవిస్తే బీమా ఉందన్న విషయం నగరంలోని చాలా మంది వినియోగదారులకు తెలియడం లేదు. దీనికి చమురు సంస్థలు, డీలర్లు వినియోగదారులకు ఎలాంటి అవగాహన కల్పించకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీనివల్ల ప్రమాద బీమా సొమ్మును బాధితులు కోల్పోతున్నారు. భారత ప్రభుత్వరంగ సంస్థలైన హెచ్‌పిఎల్, ఐఓసీఎల్ సంస్థలు బీమా కోసం కోట్ల రూపాయల ప్రీమియంను ఆయా సంస్థలకు చెల్లిస్తుంటాయి. ఎక్కడైనా సిలిండ్ పేలి ప్రాణాలు కోల్పోయినా.. గృహాలు ధ్వంసమైనా గాయాల పాలైనా పరిహారం మాత్రం బాధితులకు అందడం లేదు. నగరంలో ఇలాంటి ఘటనలు నగరంలో బాగానే జరిగినా చాలా మంది బాధితులకు పరిహారం అందనట్లు తెలుస్తుంది. ఒకవేళ ఎక్కడైనా ప్రమాదం జరిగినా మాదృష్టికి రాలేదని స్థానికంగా ఉండే డీలర్లు తెలుపుతున్నారు. గ్యాస్ ప్రమాదం జరిగినప్పుడు బీమా వస్తుందనే విషయం కూడా కొందరు వినియోగదారులకు తెలియడం లేదు. నగరం వ్యాప్తంగా వివిధ కంపెనీలకు చెందిన లక్షల కనెక్షనుల ఉన్నాయి.వీటికి ఏటా ఆయా కంపెనీ డీలర్లు మూడో (థర్డ్)పార్టీ బీమా కింద గ్యాస్ కంపెనీలకు లక్షల ప్రీమియం చెల్లించడంతోపాటు గోదాములకు అదనంగా చెల్లిస్తుంటారు. అయితే ప్రమాదం జరిగిన బాధితులు ముందుకు రాకపోవడంతో పరిహారం అందడటం లేదు. కొన్ని చోట్ల ప్రమాదం జరిగినా వాటిని గోప్యంగా ఉంచుతున్నారు. గ్యాస్ ప్రమాదం జరిగిందని ముందుకు వచ్చిన వారికి బీమా కంపెనీలు ఏదో ఒక సమాధానంతో పరిహారం తోసిపుచ్చుతున్నాయి. సిలిండర్ పేలి మరణిస్తే యాభైలక్షలు, గాయాలపాలైతే నలభై లక్షలు చొప్పున కంపెనీలు చెల్లించాలి, ఇంత పెద్దఎత్తున చెల్లించలేని కంపెనీలు ఈవ్యవహారాన్ని గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు తలియకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో ప్రమాదానికి గురైన ప్రజలు పరిహారం అందుకోలేకపోతున్నారు.

**బీమా పొందడం ఇలా..** ఎక్కడైనా సిలిండర్ పేలి ప్రమాదం జరిగినట్లయితే వెంటనే సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి లిఖిత పూర్వకంగా సమాచారము అందించాలి. సిలిండర్ పేలడం వల్ల ఎవరైనా మరణిస్తే వారికి సంభందించిన ధృవీకరణ పత్రాలను ఆస్పత్రిలో చికిత్స వివరాలను అందజేయాలి. ఈ ప్రమాదం జరిగిన సమాచారాన్ని పోలీసులకు, బీమా కంపెనీలకు తెలపాల్సిన బాధ్యత స్థానిక డీలర్లపై ఉంటుంది. అర్హుల ఎంపికను మాత్రం.. గ్యాస్ కనెక్షన్ పొందినవారు సంస్థ ఇచ్చిన పరికరాలను మాత్రమే వినియోగించాలి. ఐఎస్ఐ మార్క్‌లేని వాటిని వాడితే పరిహారం అందదు. గ్యాస్ కనెక్షన్ తీసుకునే సమయంలో ఇచ్చిన చిరునామాలో కాకుండా వేరే చోట ప్రమాదం జరిగినా బీమా లభించదు. ఈనిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ వినియోగించినా.. ప్రజల నిర్లక్ష్యం వల్ల ప్రమాదం సంభవించినా పరిహారం అందదని తెలుపుతున్నారు.

# మిస్టరీగానే రియల్టర్ అదృశ్యం

**ఘట్‌కేసర్‌లో ఆటో దిగినట్లు సీసీ ఫుటేజీ లభ్యం**

**రియల్టర్ మామిడి జనార్ధన్‌రెడ్డి వాస్తంపై కుటుంబ సభ్యుల అనుమానం**

**అల్వాల్ పోలీసు స్టేషన్ ముందు బైఠాయింపు**



**పోలీసు స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాంచిన కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో తిరుపతి రెడ్డి (ఫైల్ ఫొటో))**

అల్వాల్, జూలై 14 (ప్రభాతవార్త): జనగాంకు చెందిన రియల్టర్ బిజెపి నేత ముక్కర తిరుపతి రెడ్డి అదృశ్యంకు సంబంధించిన కేసులో పోలీసులకు పలు ఆధారాలు లభించాయి. సీసీ ఫుటేజీలుతో పాటుగా తన స్నేహితుడితో తరుచుగా ఫోన్ మాట్లాడుతున్న విషయాన్ని గుర్తించారు. సంబంధిత వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ ఉందంతం రాజకీయ రంగు పులుముకుంది. గురువారం ఉదయం అల్వాల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి తిరుపతి రెడ్డి కిడ్నాప్‌కు గురైనట్లు బాధితుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును ఛేదించడానికి నాలుగు టీములు రంగంలోకి దిగాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితుడు గురువారం ఉదయం ఆటోలో ఒంటరిగా వెళ్ళిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఫుటేజీ ఆధారంగా చేసుకుని పోలీసులు ఆటో డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఏడు వందలు రూపాయలకు కిరాయి మాట్లాడుకుని ఘట్‌కేసర్ వద్ద తిరుపతి రెడ్డిని దించినట్లు అతను స్పష్టం చేశాడు. ఘట్‌కేసర్ వద్ద సీసీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు అక్కడ ఆటో దిగిన దృశ్యాలు సేకరించారు. అక్కడ నుంచి తిరుపతి రెడ్డి ఎక్కడికి వెళ్ళాడనే దానిపై ఆరా తీస్తున్నారు. స్నేహితుడితో బాధితుడు తరుచు మాట్లాడుతన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు. రియల్ వ్యాపారానికి సంబంధించిన ఒత్తిడిలో తిరుపతి రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది.

**మామిడి జనార్ధన్‌రెడ్డిపై అనుమానం ఉంది: కుటుంబ సభ్యులు**

తన భర్తకు మామిడి జనార్ధన్‌రెడ్డి అనే వ్యక్తితో భూ వివాదం ఉందని తిరుపతి రెడ్డి భార్య సుజాత పేర్కొన్నారు. అల్వాల్‌లోని తమ భూమిలోకి అక్రమంగా చొరబడి బెదిరంచారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేకు జనార్ధన్ రెడ్డి అనుచరుడని తెలిపారు. తన భర్తను కిడ్నాప్ చేశారని ఆయనకు ఎటువంటి హాని జరిగినా జనార్ధన్ రెడ్డి బాధ్యుడని ఆమె స్పష్టం చేశారు. పోలీసులు ఏక పక్షంగా వ్యవహారిస్తున్నారని ఆరోపించారు.

# హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి



హైదరాబాద్, జూలై 14,ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న పలువురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు కూడా ఇచ్చింది. ఈబదిలీలు, పోస్టింగ్‌లద్వారా మొత్తం 31మంది ఐఏఎస్ అధికారులు నూతన బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈనేప థ్యంలోనే ప్రభుత్వం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టిని నియమించింది. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనుదీప్ దేశంలోనే నెంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. ఐఏఎస్ అయ్యాక 2018లో మొట్టమొదటగాభద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధుల్లో చేరాడు. 2021 జూన్ 1న అంతకుముందున్న ఎంవిరెడ్డి పదవీ విరమణ పొందటంతో భద్రాది జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించాడు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. కాగా కలెక్టర్ అనుదీప్ స్వస్థలం జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామం.

# రాజకీయ లబ్ధి కోసమే యుసిసి బిల్లును పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశ పెట్టడానికి సిద్ధమవుతున్న బిజెపి

**ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ**



చార్మినార్, జూలై 14 ప్రభాతవార్త : భారత దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు.హైదారాబాద్ దారుసలాంలోని ఎఐఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై విరుసుకు పడ్డారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) బిల్లును ప్రవేశ పెట్టడానికి సిద్దమవుతున్నదని తెలిపారు.ఎన్నికలు సమీపిస్తుండటంతో బిజెపి యూనిఫాం సివిల్ కోడ్ అంశాన్ని తెర పైకి తీసుకువచ్చి రాజకీయంగా అన్ని విధాల ఉపయోగం పొందాలని చూస్తున్నదని ఓవైసీ ఆరోపించారు.భారత దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని,ఈ విషయంలో 21వ లాకమిషన్ చెప్పిన విషయాన్ని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ గుర్తు చేశారు.కొద్ది రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్‌తో యూనిఫాం సివిల్ కోడ్‌పై సమావేశమై చర్చింటం జరిగిందని,త్వరలో ఎపి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఉమ్మడి పౌరస్మృతిపై మాట్లాడుతానిని ఆయన వెల్లడించారు.

# మెట్రో రైళ్లకు అదనపు బోగీలు

**ఆగస్టు నాటికి మూడు కోచ్‌లు ఏర్పాటు చేయడానికి కసరత్తు**

హైదరాబాద్, జులై 14 ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో మెట్రోకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మెట్రో ప్రారంభంలో రోజుకు లక్ష మంది ప్రయాణికులు ప్రయాణించేవారు. అయితే ఇప్పుడు రోజూ 5.10 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మెట్రో రైళ్లన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా ప్రయాణికులు రద్దీ తగ్గడంలేదు. ట్రాఫిక్ సమస్యను నివారించడం లోపాటు త్వరగా గమ్యస్థానానికి చేరుకోవడం వల్ల చాలా మంది మెట్రోలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సొంత వాహనాలు ఉన్నవారు సైతం ట్రాఫిక్ దృష్ట్యా వాటిని పక్కన పెట్టి త్వరగా కార్యాలయానికి చేరుకునేందుకు మెట్రోను ఆశ్రయిస్తున్నారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కనీసం నిలబడేందుకు కూడా స్థలం లేదు. అలాంటి సమయాల్లో తదుపరి రైలు కోసం వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో మెట్రో రైళ్ల బోగీల సంఖ్యను పెంచాలన్న డిమాండ్ ప్రయాణికుల నుంచి ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఇప్పుడు ఎట్టకేలకు వారి కోరిక నెరవేరనుంది. ఆగస్టు నాటికి మూడు అదనపు కోచ్‌లను మెట్రో రైళ్లకు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అదనపు కోచ్‌లను కొనుగోలు చేయడానికి సమయం పట్టవచ్చు. అందుకే కోచ్‌లను అద్దెకు తీసుకోవాలని హైదరాబాద్ మెట్రో అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు చెన్నై, నాగ్‌పూర్ మెట్రో అధికారులతో అద్దెకు మాట్లాడుతున్నారు. ఆగస్టు నాటికి మెట్రో రైళ్లకు అదనపు కోచ్‌లు రానున్నాయి. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు కొంత మేర తగ్గనున్నాయి. అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసినా మెట్రో రైళ్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ప్లాట్‌ఫారమ్‌లు, ట్రాక్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌ల పొడవు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. ఇతర మార్గాలతో పోలిస్తేఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో ఈ మార్గంలోని అన్ని రైళ్లకు త్వరలో మూడు అదనపు బోగీలు అందుబాటులోకి రానున్నాయి. ప్రసుత్తం మెట్రో రైళ్లలో మూడు కోచ్‌లు మాత్రమే ఉన్నాయి. ఇందులో అరబోగి మహిళలు, వృద్ధులకు ప్రత్యేకంగా కొన్ని సీట్లు కేటాయించారు. ఇది కాకుండా మిగతా ప్రయాణికులకు సీటింగ్ సరిపోవడం లేదు. ఇప్పుడు మరో మూడు కోచ్‌ల చేరికతో మొత్తం కోచ్‌ల సంఖ్య ఆరుకు చేరుతుంది. దీంతో సీటింగ్ కెపాసిటీ కూడా పెరుగుతుంది. మెట్రో విస్తరణకు కూడా విస్తరిస్తున్నారు. రాయదుర్గం-శంషా బాద్ ఎయిర్‌పోర్టు మెట్రో పనులు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# దుర్గంచెరువులో యువతి మృతదేహం లభ్యం



గచ్చిబౌలి, జూలై 14 ప్రభాతవార్త : కేబుల్ బ్రిడ్జ్ మీద నుంచి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహాన్ని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంతో కలిసి మాదాపూర్ పోలీసులు శుక్రవారం వెలికితీశారు. ఆత్మహత్య చేసుకున్న యువతిని పాయల్‌గా గుర్తించిన పోలీసులు ప్రేమ వ్యవహారమే పాయల్ ఆత్మహత్యకు కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈసంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా చించోలి పరిధిలోని షాదిపురా గ్రామానికి చెందిన పాయల్(20) గత నాలుగు నెలల క్రితం నగరానికి వలస వచ్చింది. తన సొంత గ్రామానికి చెందిన భాగ్యశ్రీతో కలిసి జూబ్లిహిల్స్‌లోని రోడ్ నెంబరు 27లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ జూబ్లిహిల్స్‌లోనే ఓ ఇంట్లో ఇంటిమనిషిగా, బేబి కేర్ టేకర్‌గా పాయల్ పనిచేస్తుంది. కాగా గురువారం మద్యాహ్నం తన స్నేహితురాలితో కలిసి మాదాపూర్‌లోని డిమార్ట్‌కు వచ్చిన పాయల్ అనంతరం కేబుల్ బ్రిడ్జ్ సందర్శనకు వచ్చారు. కేబుల్ బ్రిడ్జ్ మీద ఇద్దరు నడుచుకుంటూ తనను ఫోటోలు తీయాలని స్నేహితురాలికి చెప్పిన పాయల్ ఒక్కసారిగా బ్రిడ్జ్ మీద నుంచి దుర్గం చెరువులో దూకింది. పాయల్‌ను కాపా డేందుకు భాగ్యశ్రీ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పాయల్ ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న లేక్ పోలీసులు, మాదాపూర్ పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంతో కలిసి పాయల్ మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. గురువారం రాత్రి వరకు పాయల్ మృతదేహం లభించకపోగా, రాత్రి కావడంతో గాలింపు నిలిపివేసి శుక్రవారం ఉదయం తిరిగి కొనసాగించారు. శుక్రవారం మద్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పాయల్ మృతదేహాన్ని దుర్గంచెరువు నీటిలో నుంచి వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పాయల్ ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని, తాను ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పడంతో తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వంపై నమ్మకం లేదు.. విద్యార్థుల వినూత్న నిరసన



**దత్తానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవాలని హిమాన్షును కోరుతున్న విద్యార్థులు**

హైదరాబాద్, జులై 14 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మనవడు హిమాన్షు అన్న మా పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి పరచండి. 'మన ఊరు-మన బడి' ద్వారా మా పాఠశాలను అభివృద్ధి చేస్తామని ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వంపై నమ్మకం లేదని హిమాయత్‌నగర్‌లోని దత్తానగర్‌లోని పాఠశాల విద్యార్థులు శుక్రవారం నాడిక్కడ వినూత్నంగా ప్రదర్శన చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి కెటిఆర్ తనయుడు హిమాన్షు రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి, గౌలిదొడ్డిలోని కేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారని, అలాగే నగర నడిబోడ్డున ఉన్న తమ పాఠశాలను సైతం దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని విద్యాకుసుమాలు, బాల సంఘం, ఎఐవైఎఫ్, సంయుక్తంగా హిమాన్షును డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.బాలకృష్ణ, నిర్లకంటి శ్రీకాంత్, బాల సంఘం హైదరాబాద్ జిల్లా కన్వీనర్ షేక్ మహమూద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేయకుండా కాలయాపన చేస్తున్నదని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువైనాయని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మరుగుదొడ్లు, గ్రంథాలయం, ఆటస్థలం, క్రీడాసామాగ్రి తదితర వసతుల కల్పన జరగలేదని ఆరోపించారు. హిమాన్షుకు పాఠశాలలపై ఉన్న దూరదృష్టి ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.



**సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వెనక చిలుకలగూడకు వెళ్లేదారిలో వారం రోజులుగా డ్రైనేజీ పొంగుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు.. ఇబ్బందిపడుతున్న ప్రజలు**



# హుస్సేన్ సాగర్‌లో వాటర్ రెస్క్యూ ఆపరేషన్‌పై అవగాహన సదస్సు

హైదరాబాద్, జూలై 14,ప్రభాతవార్త: హుస్సేన్ సాగర్‌లో అగ్నిమాపక సిబ్బందికి చెందిన వాటర్ రెస్క్యూ ఆపరేషన్ బృందం అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 149మందికి అధికారులు శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో 64మంది ఫైర్‌మన్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వరదల సమయంలో ఆపదలో ఉన్నవారిని ఎలా రక్షించాలనే అంశాలపై అధునాతన పద్ధతుల్లో మూడు రోజులపాటు ఫైర్‌మెన్‌లకు శిక్షణ ఇచ్చారు. పూణెలోని ఇండియన్ రెస్క్యూ అకాడమీ నుంచి వచ్చిన సిబ్బంది వీరికి శిక్షణ ఇచ్చారు.

## నగరంలో చంద్రయాన్ 3 రాకెట్ స్పేర్‌పార్ట్స్ తయారీ



హైదరాబాద్, జులై 14 ప్రభాతవార్త : బాహుబలికే బాహుబలి.. 6లక్షల 40వేల టన్నుల బరువైన రాకెట్ ద్వారా చంద్రుడిపై దిగే విక్రమ్ ల్యాండర్ అంతరిక్షంలోని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించింది. చంద్రుడిపై దిగే విక్రమ్ ల్యాండర్ 40 రోజులపాటు ప్రయాణించి..చందమామపై దిగనుంది. కాగా, చంద్రయాన్ 3 రాకెట్ ప్రయోగానికి సంబంధించి హైదరాబాద్ కీలక పాత్ర పోషించింది. శ్రీహరికోట నుంచి రాకెట్ ప్రయోగం చేయగా.. చంద్రయాన్ 3 రాకెట్ తయారీకి కావాల్సిన విడిభాగాలు హైదరాబాద్‌లోని నాగసాయి ప్రెసెసియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తయారు చేసింది. రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్‌లో బ్యాటరీలు ఏర్పాటు చేసుకునే విడి భాగాలను హైదరాబాద్ కూకట్‌పల్లిలో తయారు చేశారు. ప్రశాంత్‌నగర్‌లోని ఈ కంపెనీ యజమాని డిఎన్‌రెడ్డి 1998 నుంచి ఇస్రో ప్రయోగించిన 50 శాటిలైట్లకు పలు విడిభాగాలు అందించారు. ఇప్పుడు కూడా చంద్రయాన్ 3 కోసం పలు స్పేర్‌పార్ట్స్‌వి తయారు చేసి అందించారు.

## రెండు రోజులు లిక్కర్ షాపులు బంద్




హైదరాబాద్, జులై 14 ప్రభాతవార్త : మద్యంప్రియులకు బ్యాడ్ న్యూస్. రెండు రోజుల పాటు మద్యం దుకాణాలను మూసి ఉంచాలని హైదరాబాద్ పోలీసులు తెలిపారు. వచ్చే ఆదివారం హైదరాబాద్‌లో బోనాల పండుగ నేపథ్యంలో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూలై 16, 17వ తేదీల్లో మద్యం దుకాణాలు తెరవరాదని, సౌత్ ఈస్ట్, వెస్ట్ జోన్లలో జులై 16వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. 17వ తేదీన సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. అలాగే సౌత్ జోన్ పరిధిలో 16వ తేదీ ఉదయం నుంచి అమలులోకి రానున్నా ఈ ఉత్తర్వులు 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు కొనసాగనున్నాయి. మద్యం షాపులను నిర్దేశించిన సమయాల్లోనే మూసివేయాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనేర్ సివి ఆనంద్ ఉత్తర్వులో పేర్కొన్నారు. వైన్ షాపులతో పాటు మద్యం అందించే బార్లు, క్లబ్బులు, పబ్బులను కూడా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలన్నీ పూర్తిగా బంద్ కానున్నాయి. బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని వైన్ షాపులను మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి తగాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## మరణించిన ఎస్సైకి పోస్టింగ్

**పొరపాటు గమనించి పేరు తొలగింపు**

దుండిగల్, జులై 14 ప్రభాతవార్త : దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ నెలరోజుల క్రితం మరణించిన ప్రభాకర్‌రెడ్డిని బదిలీ చేస్తూ సైబరాబాద్ కమీనరేట్ నుండి ఆదేశాలు రావడం చర్చనీయాంశంగా మారింది. దుండిగల్ ఎస్సైగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి జూన్9న గుండెపోటుతో మరణించారు. సైబరాబాద్ కమీనరేట్ పరిధిలోని ఎస్సైలను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈజాబితాలో ఆయన పేరుంది. ఈ ఉత్తర్వులు సామాజిక మాద్యమాల్లో చక్కర్లు కొట్టడంతో గమనించిన అధికారులు ప్రభాకర్‌రెడ్డి పేరును తొలగించి కొత్త జాబితాను విడుదల చేశారు. అయితే ఎస్సైల బదిలీల జాబిత సిద్ధం చేసే నాటికి ప్రభాకర్‌రెడ్డి విధుల్లో ఉన్నారని, పొరపాటుగా అవే పేర్లతో ఆదేశాలు వెలువడ్డాయి. గుర్తించి వెంటనే కొత్త జాబితాను విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

# సింహవాహిని అమ్మవారికి కనక దుర్గమ్మ పట్టువస్త్రాలు సమర్పణ



**పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ కమిటీ**

చాంద్రాయణగుట్ట, జూలై 14 ప్రభాతవార్త : బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పాతబస్తీలోని అమ్మవారి ఆలయాలకు విజయవాడ కనకదుర్గమ్మ తల్లి పట్టు వస్త్రాలను సమర్పించారు. కనకదుర్గమ్మ దేవస్థానంఆలయ కమిటీ ఈఓ భ్రమరాంబ, బోర్డు చైర్మన్ రాంబాబు బృందం అక్కన్నమాదన్న, మీరాలంమండి మాతేశ్వరీ మహంకాళి, ఉప్పుగూడ మహంకాళి, గౌలిపురా భారతమాత, బేలా ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు.

**అమ్మవారికి బంగారు బోనం, పట్టువస్త్రాలు సమర్పణ**

ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాలను పురష్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు ఆలె భవ్య ఆధ్వర్యంలో సింహవాహిణి మహంకాళి అమ్మవారికి బంగారు బోనం, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపి వి.హనుమంత్ రావు, బీసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణలు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్ సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మారుతీ యాదవ్, పోసాని విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఉస్మానియాలో రోజుకు 15వేల లీటర్ల ఉచిత మంచినీళ్లు పంపిణి




**ఉస్మానియా ఆసుపత్రి ఆర్వో ప్లాంటు వద్ద ప్రజా ప్రతి నిధులు, వైద్యులు**

అఫ్జల్‌గంజ్, జూలై 14 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ ఆరోగ్య సంక్షేమ కోసం ఎంతో కృషి చేస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు.ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి, హెల్ప్‌నీడి సంస్థ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వో ప్లాంటు 23వ వార్షికోత్సవ వేడుకలల్లో బేగం బజార్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి పక్షనేత గొంటి శంకర్‌యాదవ్, గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్‌బిలాల్, బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉస్మానియా ఆసుపత్రిలో 23 సంవత్సరాల నుంచి నిరంతరంగా రోగులకు ఉచితంగా మంచినీళ్లు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆర్వోప్లాంటుకు సహకరించిన దాతాలకు శాలువ కప్పి సన్మానించారు.మంచినీటి సేవాతోపాటు వీల్‌చైర్లు, స్ట్రెచర్లను అందచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్, కోశాధికారి రాకేష్, హెల్ప్ నీడి ప్రతినిధులు నర్సింగ్ రావు, విజేందర్‌రెడ్డి, కె.రాజు, ఉస్మానియా ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్లు శేషాద్రి, రఫీ, సంఘ సేవకులు దేవర రాజేశ్వర్, కట్టమల్లేశం, బిఆర్‌ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, కోఠి, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ప్రముఖుల హాజరు

ఖైరతాబాద్, జులై 14: అంగరంగ వైభవోపేతంగా మహిళలు ఎంతో సంబురంగ నిర్వహించుకునే బోనాల ఉత్సవాలకు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. ప్రముఖంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎం.పి ఎం.అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, ప్రభృతులు బోనాల ఉత్సవాల్లో కొందరు, మరికొందరు దేవాలయాలలో పాల్గొంటున్నట్లు ఆలయాల నిర్వాహకులు సూచిస్తున్నారు.

## అమ్మవారి ఘటానికి పూజలు



అమ్మవారి ఘటానికి పూజలు చేసిన బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం అశీష్‌కుమార్‌యాదవ్,నిర్వాహకులు ముత్యాల గోవింద్‌రాజు

అఫ్జల్‌గంజ్, జులై 14ప్రభాతవార్త: ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అఫ్జల్‌గంజ్ అశోక్ బజార్ మహంకాళి దేవాలయం నుంచి బయలు దేరి అమ్మవారి ఘట్టానికి గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ స్వాగతం పలికారు.అమ్మ వారి ఘటానికి పూజలు చేశారు.ఈకార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు ముత్యాల గోవింద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర పోస్టర్ ఆవిష్కరణ



బోనాల జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

గన్‌ఫౌండ్రి,జులై 14 ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బోనాల పండుగ వేడుకలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపు కోవాలని మాజీ కార్పొరేట ర్లు పి.మమత సంతోష్‌గుప్త, ముఖేష్ సింగ్,పరమేశ్వరి సింగ్ లు పిలుపు నిచ్చారు.బోనాల జాతర నేపథ్యంలో గోషామ హాల్‌లోని బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ పక్షాన ముద్రించిన బోనాల జాతర పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, బెజ్జిని శ్రీనివాస్, మహిళా నాయకురాల శాంతిదేవి, ఆలపురు షోత్తం పాల్గొన్నారు.

## ఆలయాల వద్ద భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు : జంపనప్రతాప్



1వ వార్డు బాపూజీ నగర్ నల్లపోచమ్మ అలయంలో పూజలు చేసెస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,జులై 14 ప్రభాతవార్త: ఆషాడమాసం బోనాల జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ సూచించారు. ఆషాడమాసం శుక్రవారంను పురస్కరించుకొని 1వ వార్డు బాపూజీ నగర్‌లో ఏర్పాటు చేసిన అభిషేకం, ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు మెరుగుపర్చాలని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజిత్ కళ్యాణ్, నర్సింహ్మా, రామారావు, దుర్గయ్య, జహంగీర్,దశరత్, మహేందర్, అరుణ్ యాదవ్, నరేందర్,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లు రవిని కలిసిన నాయకులు సత్యం శ్రీరంగం



మూసాపేట, జులై 14, ప్రభాతవార్త : టీపీసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జ్ డా.మల్లు రవిని పలువురు అభినందించారు. టీపీసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డిలు ఆయనను శువ్రాకరం కలిశారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్‌టియూసి అధ్యక్షులు నరసింహాయాదవ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింమాయాదవ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జహంగీర్, నయీమ్, శేకర్ గజానంద్, మహేందర్, పొట్టన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష కుంకుమార్చన పూజ కార్యక్రమ

చార్మినార్,జులై 14 ప్రభాతవార్త : ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న దేవాలయంలో శు క్రవారం సాయంత్రం లక్ష కుంకుమార్చన పూజ కార్యక్రమం జరిగింది.దేవాలయం కమిటి చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రౌడీషీటర్ల బైండోవర్

యూసుఫ్‌గూడ, జులై 14, ప్రభాతవార్త : బోనాల ఉత్సవాల సందర్భంగా బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు రౌడీ షీటర్లను బోరబండ పోలీసులు బైండోవర్ చేశారు. ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలను, రాబోయే వినాయక చవితి ఉత్స వాలను పురస్కరించుకుని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మహ్మద్ ఉస్మాన్,ఎమ్‌డియి ఆయాద్, అనే రౌడీ షీటర్లను ఆర్డీవో కోర్టులో ఒక సంవత్సరం కాలానికి గాను బైండోవర్ చేయడం జరిగిందని సిఐ రవికుమార్ పేర్కొన్నారు.

## ఏపీ మంత్రి బొత్స వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

ధర్నాచౌక్, జులై 14, ప్రభాతవార్త: తెలంగాణ విద్యా వ్యవస్థపై ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సీనియర్ న్యాయవాది డి.రామ్‌రెడ్డితో కలసి ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఏపీ విద్యా విధానాన్ని అఫ్జాల్ తెలంగాణాతో పోల్చి చూడటం సరికాదు అంటూ బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు ఆయన నోటి దురుసుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిది సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి చూసి, ఆంధ్ర ప్రాంతంలో కూడా కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ కు వస్తున్న ఆదరాభిమానాలు చూసి తట్టుకోలేక ఓర్వలేని తనంతో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టమవుతోందని అన్నారు. కేంద్రం 22 అవార్డులు ప్రకటిస్తే 18 అవార్డులు తెలంగాణకు వచ్చిన నిజాన్ని మరిచిపోయి, అక్కసుతో ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని హితవు పలికారు.

## అంబర్‌పేట నియోజకవర్గంలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ద చూపించాలి



కమిషనర్, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హైదరాబాద్, జులై 14 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ద చూపాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిహెచ్ఎంసి కమీషనర్ రోనాల్డ్ రోస్, ఇతర అధికారులతో కలిసి నియోజవర్గంలోని పలు ప్రాంతాలలో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వీధి చివర్లలో ఉండే చెత్తకుండిలు, బస్తీల్లో ఉంటున్న డపింగ్ యార్డులను నిత్యం ఖాళీ చేయించాలని, డ్రైనేజీలైన్‌ల నిర్వహణ మెరుగ్గా చేయాలని, మురుగునీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిలోని చెత్తను సమీప నివాసాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని చెప్పారు. ఎమ్మెల్యే, కమీషనర్ కాచిగూడ డివిజన్‌లోని వైఎంసిఎ, లింగంపల్లి చౌరస్తా, కుత్బిగూడ, చప్పల్‌బజార్, గోల్నాక డివిజన్‌లోని న్యూబ్రిడ్జి, జిందా తిలిస్మాత్‌రోడ్డు, డీ-మార్ట్‌లైన్, వడ్డెర బస్తీ తదితర లైన్‌లలో అధికారులతో కలిసి పర్యటించారు. అంతకు ముందు జిహెచ్ఎంసి నూతన కమీషనర్‌గా విచ్చేసిన రోనాల్డ్‌రోస్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

### బంగారు మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ఆశీర్వచనం పొందుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, జులై 14 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట బంగారు మైసమ్మ అమ్మవారిని శుక్రవారం ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనం పొందారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో అందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

### అద్భుతం, అమోఘం త్రిష్య రాఘవన్ కర్ణాటక గానగోష్ఠి



త్రిష్య రాఘవన్‌ను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, జులై 14 ప్రభాతవార్త: యువభారతి ప్రోత్సాహం కింద వంశీ ఇంటర్నేషనల్ ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగసప్తస్వరమ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికలో యువగాయని 'త్రిష్య రాఘవన్‌చే కర్ణాటక గానగోష్టి గాన కార్యక్రమం అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, రాగసప్తస్వరమ్ సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఎస్.రాజ్యలక్ష్మి, ఆరభి ది సెంటర్ ఫర్ ఫర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు, ప్రముఖ వాయులీన విద్వాంసులు 'కళారత్న' అశోక్ గుర్జాలే, కర్ణాటక సంగీత విద్వాంసురాలు, సినీనేపథ్యగాయనీ శ్రీనిధి తిరుమల తదితరులు హాజరై అద్భుతంగా గానం చేసిన త్రిష్య రాఘవన్‌ను ప్రశంసించారు. భారతదేశానికి చెందిన త్రిష్య అమెరికా పౌరసత్వంతో అక్కడ ఉత్తర కరోలినాలో విద్యనభ్యసిస్తూ ప్రమీలరాణి వద్ద శిక్షణలో శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారని, ఆమె తల్లిదండ్రులు సమంత-రాఘవన్ శ్రీనివాస్‌లు సంగీత అభిమానులని వక్తలు కీర్తించారు. ఈ సందర్భంగా సంగీతన కార్యక్రమంలో వాయోలిన్‌పై అభిరామ్ లోల్ల, మృదంగంపై కెఎల్‌కె.భార్గవ్ వాద్యసహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో బోనాల ఉత్సవాల ఏర్పాటుకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, జులై 14, ప్రభాతవార్త : బోనాల పండుగను పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అమ్మవారి దేవాలయాలకు సంబంధించి 104 చెక్కుల మొత్తం 33లక్షల 65వేల రూపాయలను ఆయా దేవాలయాలకు సంబంధించిన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని కులాలు, మతాలు వారికి సమ ప్రాధాన్యతనిస్తూ వారి వారి ఆచార సంప్రదాయాలు ప్రకారం వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారని అన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా బోనాలు, బతుకమ్మ పండుగలు ఇంత విస్తృతంగా అవ్వడానికి కారణం ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత మాత్రమే సాధ్యమైందని నేడు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది తమ సంప్రదాయ పండుగ బోనాలను బతుకమ్మలను చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి : ఎమ్మెల్యే మాధవరం**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్దిదారులు ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

## అక్రమ ఆయుధం కలిగి ఉన్న దుండగుని అరెస్ట్

కుషాయిగూడ, జులై 14 ప్రభాతవార్త : అక్రమ ఆయుధం కలిగి ఉన్న దుండగుడుని అరెస్టు చేయడంతో పాటు ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, డీసీపీ జానకి ధరావత్, ఎస్ఓటి డిసిపి గిరిధర్, కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డిలు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 14 శుక్రవారం సాయంత్రం అందిన విశ్వసనీయ సమాచారంతో చర్లపల్లి పోలీసులు ఎస్ఓటీ పోలీసులు మాట వేసి చర్లపల్లి బ్రిడ్జ్‌నుండి జైలో కారులో దేశీయ తుపాకీతో వెళ్తున్న నిందితుడు యోగేంద్ర రాజ్‌పుత్ కారు ఆపి అతన్ని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద గల దేశీయ తుపాకీని మూడు రౌండ్స్ ఫిరంగులను, రెండు సెల్‌ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఎస్ఓటి ఇన్‌స్పెక్టర్ రాములు, సబ్ ఇన్‌స్పెక్టర్లు వాసుదేవ్, రఘురాముడు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కర్ణాటక సంగీతం అత్యుత్తమైంది

**ప్రఖ్యాత వాయులీన విద్వాంసులు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి**



ప్రఖ్యాత వాయులీన విద్వాంసులు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామికు 'డాక్టర్ బాలమురళీకృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారం' ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి, జులై 14 ప్రభాతవార్త: కర్ణాటక సంగీత అభివృద్ధి చెందినట్లు ప్రపంచంలో మరే ఇతర సంగీతం ఉన్నతి చెందలేదని అత్యుత్తమైందని ప్రఖ్యాత వాయులీన విద్వాంసులు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి అన్నారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతోత్సవమ్ జాతీయ వాద్యకళాకారుల సంఘం, అక్లాండ్‌కు చెందిన సంగీతభారతి సంయుక్త ఆధ్వర్యంలో విఖ్యాత సంగీతజ్ఞులు, పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 93వ జయంతోత్సవమ్ సందర్భంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వాయులీన కళాకారులు డాక్టర్ అన్నవరపు రామస్వామికి 'డాక్టర్ బాలమురళీకృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారం' బహుకరించే కార్యక్రమం సంఘం అధ్యక్షుడు చెన్నారావు, సంగీత భారతి ప్రతినిధి డాక్టర్ పద్మాగోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగింది. అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ బాలమురళీ తాను శరీరాలు మాత్రమే వేరు అన్నారు. 99 ఏళ్ళ వయస్సులో విజయవాడ నుంచి హైదరాబాద్ దాకా రావటానికి కారణం బాలమురళికి భారతరత్న అవార్డు ప్రకటించాలని అందరి సమక్షంలో కోరేందుకేనని అన్నారు. బాలమురళీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వేదికపై 30 మంది వివిధ ప్రక్రియల కళాకారులకు 'గాన కళావసంత', సేవా ప్రవీణ, కళాప్రవీణ వంటి బిరుదులతో ప్రతిభాపురస్కా రాలను అందించారు. హైదరాబాద్ బ్రదర్స్, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, తుమ్మల రామసతయనారాయణ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ మంచుకొండ రంగయ్య, వేముల శ్రీనివాస్, ఎల్‌వి.రమణ, హనుమంతు, నాగేశ్, సురేందర్, రవి ములకలపల్లి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ పద్మ గోవర్ధన్ స్వాగతం పలుకగా కార్యక్రమానికి ముందు ప్రఖ్యాత గాయకుడు డి.వి.మోహనకృష్ణ, విష్ణుప్రియల శాస్త్రీయ గానగోష్ఠి సంగీత ప్రియులను ఓలలాడించింది.

# ఘనంగా జరిగిన గాలిపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

**ప్రత్యేక పూజలు చేసిన ఎంపి రంజిత్‌రెడ్డి**



హైదర్షాకోట్‌లో జరిగిన గాలిపోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎంపి రంజిత్‌రెడ్డి

నార్సింగి, జులై 14 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో శుక్రవారం "గాలిపోచమ్మ" అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, వందలాది మంది భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య, ఆగమ శాస్త్రానుసారంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాన క్రతువును జరిపించారు. అమ్మవార్ల ఆలయాల పునర్ నిర్మాణం, బోనాల వేడుకలను పురస్కరించుకొని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పుర ప్రముఖులందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. గ్రామ పెద్దలందరికి తగిన గౌరవాన్ని కల్పించారు. ఈ వేడుకలకు చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి, మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలన్నారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డ నేటి పట్టణ ప్రజలు మానసిక, శారీరక ప్రశాంతత లేక ఉక్కిరిబిక్కిరవుతున్నారని, అలాంటి వారు తమ దినచర్యలో దేవాలయ దర్శనంను చేర్చుకుంటే ఆందోళన, ఆవేదన వెళ్లిపోయి ఆనందంగా ఉండగలుగుతారన్నారు. మనం జరుపుకునే పండగలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు వారధిలా ఉపకరిస్తాయన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడిన తరువాతనే బోనాలకు సీఎం కేసీఆర్ ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధుల నుంచి ప్రజలను గ్రామ దేవతలైన మైసమ్మ, పోచ మ్మ, ఈదమ్మ, ఎల్లమ్మలు కాపాడుతారనే భక్తిభావంతో బోనాలు చేయడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తుందని ఎంపి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చంద్రశేఖర్, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ యాదిరెడ్డి, పుర ప్రముఖులు మల్లారెడ్డి, నర్సిహ్మారెడ్డి, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కుమార్ యాదవ్, సదానంద్‌గౌడ్, దశరథ్, అర్జున్ యాదవ్ పాల్గొన్నారు.

## ఆదర్శవంతంగా సనత్‌నగర్ నియోజకవర్గం

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

సికింద్రాబాద్, జులై 14 ప్రభాతవార్త: సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నికోట్లు నిధులైనా ఖర్చు చేసేందుకు వెనుకాడబోమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో దాదాపు రూ. 1.68 కోట్లతో 9 వివిధ రకాల అబివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా భోలక్‌పూర్‌లోని కృష్ణానగర్ కాలనీలో రూ. 14లక్షల వ్యాయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను, ఐడీహెచ్ కాలనీలో రూ. 12.30లక్షలతో సివరేజి పైప్‌లైన్ పునరుద్దరణ, కీస్‌బ్లాక్‌లో మెయిన్ రోడ్డలో రూ. 21.20 లక్షలతో సివరేజి పైప్‌లైన్, సున్నం బట్టిలోని వెటర్నరీ హాస్పిటల్ వెనకాల వీధిలో రూ. 9.20 లక్షలతో తాగునీటి పైప్‌లైన్, న్యూబోయిగూడలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో రూ. 58.90లక్షలతో వీడీసీసీ రోడ్డు, డాన్‌బాస్కో స్కూల్ వద్ద రూ. 9.80లక్షలతో సివరేజి, గవర్నమెంట్ స్కూల్ వద్ద రూ. 18.80 లక్షలతో సీసీరోడ్డు, బోయిగూడలోని జలమండలి కార్యాలయం వద్ద రూ. 9.85లక్షలతో సివరేజి, ఉప్పలమ్మ ఆలయం వద్ద రూ. 9.85 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పునరుద్దరణ పనులను ఎంఎల్‌సీ స్టీఫెన్‌సన్‌తో కలిసి ప్రారంభించారు. కృష్ణానగర్ కాలనీలో ప్రభుత్వ స్కూల్ పక్కన కాలనీలోకి రోడ్డు నిర్మిచాలని స్థానికులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్ హేమలత, జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, తహసీల్దార్ శైలజ, జలమండలి డీజీఎం ప్రభు, గాంధీనగర్ సీఐ మోహన్‌రావు, ఇతర శాఖల అధికారులు, బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్‌రాజు, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్, కుమార్ యాదవ్, రమణ, అబ్బాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగతో దేవాలయాలకు కొత్త కళ

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



ముషీరాబాద్ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, జులై 14, ప్రభాతవార్త: బోనాల పండుగతో దేవాలయాలన్నీ కళ కళలాడుతున్నాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని మహంకాళి దేవాలయంలో ఆయన కుమారుడు ముఠా జైసింహతో కలసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 16, 17 తేదీలలో జరిగే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోతరాజులతో కలసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవో జ్యోతి, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, ఆలయ మాజీ అధికార సభ్యులు చంద్రమౌళి, బీఆర్ఎస్ నేతలు బింగి నవీన్, శివ ముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, దేవాలయ కమిటీ ధర్మకర్తలు పూస గోరక్‌నాథ్, జి.రాజు, బల్లా రూపాశ్రీ, గౌరీ శంకరాలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి, లక్ష్మీ గణపతి దేవాలయ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు నర్సింగ్ ప్రసాద్, వై.శ్రీనివాస్‌రావు, రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ, ఉపాధి లేక అల్లాడిపోతున్నారు

**ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపణ**



పార్టీలో చేరిన యువతను అభినందిస్తున్న దిడ్డి సుధాకర్

సైఫాబాద్, జులై 14 ప్రభాతవార్త: దేశంలో విద్యావంతులైన లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభించక నిరాశ నిస్పృహాలతో కొట్టుమిట్టాడుతుంటే వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. దేశాభివృద్ధికి యువత రాజకీయాల్లోకి రావ డం ముఖ్యమని, యువత రాజకీయాల్లో భాగస్వామ్యం అనేది ప్రజాస్వామ్య హక్కు మాత్రమే కాదని స్థిరమైన శాంతియుత సమాజాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వంద మంది నవయువకులు శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన సందర్భంగా సుధాకర్ వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. యువత ప్రభుత్వాల తప్పిదాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ నిలదీయాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్ కమిటి సభ్యులు బుర్ర రాముగౌడ్, ఎం.ఎ.మాజీద్, డాక్టర్ హరిచరణ్‌లు పార్టీలో చేరిన యువతకు కండువాలు కప్పి పార్టీ సభ్యత్వాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు మద్ది పరేమేష్, బి.స్వామి, జనార్ధన్, పాయల రోహన్‌యాదవ్, గౌరు సాయినాథ్, దాసరి బంధు, నాగార్జున, ఆదిత్య, వంశీ, రాకేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ

మెహిదీపట్నం, జులై 14, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ స్వర్గీయ దేవరకరుణాకర్ 6వ మాసం జ్ఞాపకార్థంగా జనహిత చారిటబుల్ ట్రస్ట్, డిఎమ్ఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిజెపి గుడిమల్కాపూర్ డివిజన్ నాయకులు దేవర వంశీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పరబస్తీలోని బాల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భగవద్గీత పారాయణం ప్రవచనాలను స్థానికులకు పఠించడంతో పాటు ఉచితంగా పుస్త కాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్మన్, బిజెపా రాష్ట్ర నాయకురాలు తుల ఉమ, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు రామరాజు, హైదరాబాద్ పార్లమెంట్ కంటెస్టెడ్ ఎంపీ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంత్‌రావు, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్, బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండుయాదవ్‌లు హాజరై స్థానికులకు భగద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో బిజెపి కార్వాన్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కట్ల అశోక్, బిజెపా సీనియర్ నాయకులు బోడి అశోక్ కుమార్ యాదవ్, గంగాధర్, రాచకొండ శ్రీకాంత్ సాగర్, ముకేష్ సాగర్, సుధాకర్ యాదవ్, సందేష్ యాదవ్, ప్రభు పూజారి, దేవర కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### డిజైనింగ్‌రంగంలో ఉపాధి కల్పించడమే లక్ష్యం

హైదరాబాద్,జులై 14,ప్రభాతవార్త: సృజనాత్మకత కళలు, నైపుణ్యాలతో విద్యార్థులకు శక్తివంతం చేయడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజైనింగ్ పరిశ్రమలో ఉపాధి పొందలేలా చేడయమే తమ లక్ష్యమని వివిధ ఇనిస్టిట్యూట్‌ల ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఐఎన్ఐఎఫ్డీ కార్యాలయంలోఇంటర్ నేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్, మేధావి స్కిల్స్ యూనివర్సిటీ, ఎన్ఎస్డీసి సంయుక్త సాధికారత పొందిన డిగ్రీ, డిప్లమా ప్రోగ్రాంల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేధావి స్కిల్స్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, ఛాన్స్‌లర్ ప్రవేశ్ దుదాని, ఐఎన్ఐఎఫ్డీ గ్లోబల్ సిఈవో అనిల్ ఖోస్లా, బాలివుడ్ నటుడు అమన్‌శర్మ హాజరయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిజైన్ ఎడ్యూకేషన్‌లో మూడు ఇనిస్టిట్యూట్‌లు (ఐఎన్ఐఎఫ్డీ,ఎన్ఎస్డిసి, మేధావి స్కిల్స్)ల అనుసంధానం కొత్తశతకానికి నాంది అన్నారు. నూ ఎడ్యూకేషన్ పాలసి కింద ఫ్యాషన్, ఇంటీరియల్ డిజైన్‌లో వినూత్న ప్రోగ్రాంలు అందించబడుతాయన్నారు.

### అంబర్‌పేట్ మహంకాళి ఆలయానికి చెక్కు అందజేత



ఆలయ కమిటీకి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జులై 14,ప్రభాతవార్త: బోనాల ఉత్సవాల్లో భాగంగా అంబర్‌పేట్ మహంకాళీ ఆలయానికి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెక్‌ను అందజేశారు. శుక్రవారం ఆయల ప్రాంగణంలో కమిటీ నిర్వాహకులకు దానికి అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎండోమెంట్ ఏఈ బాలాజీ, దేవస్థాన సేవా సమితి అధ్యక్షులు వై.శంకర్‌రావు, కమిటీ సభ్యులు రంగంపల్లి రాజు, బింది మల్లికార్జున్, గడ్డం శ్రీధర్‌గౌడ్, చెంగలి సుధాకర్, దొమకొండ కిశోర్, చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, నాయకులు నర్సింహ్మారెడ్డి, చంద్రమోహన్, కెంచె మహేష్, నవీన్‌యాదవ్ ఉన్నారు.

## బంగారు మైసమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



సికింద్రాబాద్, జులై 14 ప్రభాతవార్తః డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మధురానగర్‌లోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి కోసం ప్రత్యేకంగా మగ్గంపై నేస్తున్న పట్టుచీరను పరిశీలించారు. ఆల య చైర్మన్ గుర్రం పవన్‌కు మార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ ఇతర నేతలు, భక్తులు పాల్గొన్నారు.

## బోనాల జాతరకు చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే



ఆలయ నిర్వాహకులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 14 ప్రభాతవార్త :** బోనాల పండుగ సందర్భంగా దేవాలయం ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని సుమారు 157 దేవాలయాలకు మంజూరుచేసిన చెక్కులను ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజి మురికినీటి సమస్యలు, వీధి దీపాలు వెలగకపోవడం, రోడ్ల మరమ్మత్తులు, ప్యాచ్‌వర్క్స్, మంచినీటి సరఫరా తదితర సమస్యలు తలెత్తకుండా సంబందిత అధికారులు ఎప్పకిటప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## నేడు బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి రాజకీయ ప్లీనరీ : శ్రీనివాస్‌గౌడ్

**మన్సూరాబాద్, జూలై 14 ప్రభాతవార్త :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిసిల రాజకీయసాధికారతను సాధించడానికి ఎల్బీనగర్ మన్సూరాబాద్‌లోని కెబిఆర్ కన్వెన్షన్‌లో శనివారం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల రాజకీయ ప్లీనరీని నిర్వహించనున్నారు. ప్లీనరీ ఏర్పాట్లను శుక్రవారం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... బీసీలు రాజకీయంగా అన్యాయానికి గురౌతున్నారని, 2023 ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించడానికి ఈ ప్లీనరీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడలపై ప్లీనరీలో సుదీర్ఘ చర్చ జరుపుతామని స్పష్టం చేశారు. 60శాతానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారం దక్కించుకోవడమే తమ అంతిమ లక్ష్యమని జాజుల అన్నారు. తమ చిరకాల ఆకాంక్ష బీసీలకు సీఎం పీఠమన్నారు. బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన ఈ ప్లీనరీకి రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురిగి దుర్గయ్యగౌడ్, కుందారం గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్ కురుమ, సింగం నగేష్, గురిజ నర్సింహ, నర్సింహనాయక్, పాలకూరి కిరణ్, మాదగాని కృష్ణ, కందుల ప్రభాకర్, జాజుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతరకు సిద్ధమవుతున్న ఆలయాలు

### విద్యుత్ కాంతుల వెలుగులతో ఆలయాల ముస్తాబు



బోనాల పండుగకు ముస్తాబు అవుతున్న అమ్మవారి ఆలయం...

**నేరేడ్‌మెట్, జూలై 14 ప్రభాతవార్త:** బోనాల పండుగ సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అమ్మవార్ల ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి ఆలయం, సఫిల్‌గూడలోని కట్టమైసమ్మ ఆలయం, వినాయక్‌నగర్ డివిజన్‌లోని శ్రీ సాయినగర్ నల్లపోచమ్మ ఆలయం, నేరేడ్‌మెట్, మౌలాలి తదితర డివిజన్ల పరిధిలోని ఆలయాలను కమిటీ సభ్యులు రంగురంగుల విద్యుత్‌కాంతులతో తీర్చి దిద్దుతున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్దుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆలయ ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేయడానికి అనువైన స్థలం ఏర్పాటు చేసామన్నారు. దొంగల బెడద లేకుండా పోలీసుల సహాయంతో బోనాల జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయా కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు.

## నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని జలమండలికి కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి వినతి



వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 41వ డివిజన్‌లో నెలకొన్న మంచి నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి జల మండలి జనరల్ మేనేజర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాహెబ్‌నగర్‌లోని జల మండలి కార్యాలయానికి వెళ్ళి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో నీటి సరఫరా క్రమబద్ధంగా జరగడం లేదనీ ఒక్కోరోజు ఒక్కో సమాయానికి సరఫరా అవుతున్నదని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్రఇబ్బందుకు గురువుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా డివిజన్‌లో కొన్ని చోట్ల మంచి నీటి పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో సమస్యలు కలుగుతున్నాయన్నారు. జిల్లెలగూడ పాత గ్రామంలో దాదాపు 40సంవత్సరాలక్రితం వేసిన పైపులు శిథిలావస్థలో ఉన్నందున మురికి నీరు సరఫరా అయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయన జిఎంను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే మైనంపల్లికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**మల్కాజిగిరి, జూలై 14 ప్రభాతవార్త :** ఈ నెల 16,17 తేదీన పివిఎన్ కాలనిలో జరిగే బోనాల పండుగ, ఘటాల ఊరేగింపు కార్యక్రమనికి హాజరు కావాలని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ ముదిరాజ్ తదితరులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఎస్ఆర్.ప్రసాద్, గుండా నిరంజన్, సంపత్‌రావు, సూరి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన బిటి రోడ్లు

### ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని అధికారులు



సైడు ఇవ్వబోయి రోడ్డుపై జారిపడి పడిపోయిన వాహనదారుడు

**తుర్కయంజాల్, జూలై 14 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ పరిధిలోని లక్ష్మీనగర్, సుందరయ్యనగర్, ఇంద్రమ్మకాలనీలకు హై వే రోడ్డు పక్కన ఉన్న బిటి రోడ్డు ధ్వంసమై ప్రమాదంగా మారింది. ఈ రోడ్డు మీదుగా మూడు కాలనీలకు పాఠశాలలకు సంబంధించిన బస్సులు, ఆటోలు, బైకులు, లారీలు వస్తూపోతుంటాయి. ఈ మార్గంలో ఎన్నో సార్లు వాహనాలు అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయాన్ని స్థానికులు, వాహన దారులు స్థానిక ప్రజాప్రతినిధులకు మున్సిపాలిటీ కార్యాలయంలో ఎన్నో సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం బైకుకు సైడు ఇచ్చే క్రమంలో అదుపు తప్పి క్రింద పడిపోయాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న కట్ట లోతులో పడిపోతే ప్రాణాలే పోయే పరిస్థితి ఎదురవుతుందని కాలనీవాసులు భయపడిపోతున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రాణాలు పోతేగాని అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించేలా లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనియెడల వివిధ కాలనీవాసులు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం : సామ రంగారెడ్డి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

**సైదాబాద్, జూలై 14 ప్రభాతవార్త :** డ్రైనేజీ సమస్యతో లింగోజిగూడ డివిజన్ వాసులు ఇబ్బంది పడుతున్న పాలకులు పట్టించుకోవడంలేదని రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. డివిజన్‌లోని రోడ్డు నెం.13లో డ్రైనేజీ సమస్యను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ లింగోజిగూడ డివిజన్‌లోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. వర్షాకాలంలో ప్రజలు మరింత ఇబ్బందులకు గురి అయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో విజయ భాస్కర్ ప్రవీణ్ రెడ్డి, కృష్ణంరాజు, రాజేష్ గౌడ్, రాములు గౌడ్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



డిసిపి రూపేష్‌కు పుష్పగుచ్చాలను అందజేస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, జూలై 14 ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఈస్ట్ జోన్ డిసిపి రూపేష్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా డిసిపి రూపేష్‌ను ఉత్సవ కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్, ఈస్ట్ జోన్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, చౌకి సురేష్‌కుమార్, వేముల విజయ్‌కుమార్ తదితరులు ఆహ్వానించి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.శివరాజ్, ముప్పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ కెసిఆర్‌నగర్‌లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పర్యటన

**రామంతాపూర్, జూలై 14 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పలువురు పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. కెసిఆర్ నగర్‌లో సిసి రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో నీటి బిల్లులు అధికంగా వస్తున్నాయని, రోడ్లు వేయించాలని స్థానికులు కోరారు. అనంతరం డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కెసిఆర్‌నగర్‌లో నిర్మాణంలో వెంకటేశ్వరస్వామి ఆలయం పనులు పరిశీలించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, మేకల హనుమంతరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, కొప్పు నర్సింగ్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, వెంపటి శ్రీనివాస్, ఆలే రమేష్, మనీష్, ప్రశాంత్, కాలనీ నేతలు గొలుసుల స్వామి, నాగరాజు, రాంచందర్, చందర్‌రాయుడు, యాదగిరి, బాలరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో కాంగ్రెస్ భరోసాయాత్ర



కాంగ్రెస్ భరోసా యాత్రలో పాల్గొన్న పార్టీ సీనియర్ నేతలు, ఇతర నాయకులు

**ఉప్పల్, జూలై 14 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భరోసా యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా హబ్సిగూడ స్ట్రీట్‌నెం.8లో డివిజన్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు భరోసా యాత్రకు బ్రహ్మరథం పడుతున్నారని, ఓర్వలేకే డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి,ఇతర ఫించన్లు అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు మేకల శివారెడ్డి, తౌఫిక్, పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, బోరంపేట కృష్ణ, రఘపతిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, సుధాకర్‌రెడ్డి, సుర్వి మురళీ, గడ్డం లక్ష్మారెడ్డి, లుకాస్, శ్రవణ్‌రెడ్డి, అరుణ్‌కుమార్, అమరేశ్వరి, ప్రకాష్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, బాలరాజు, బాకారం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు ప్రజలు గుణపాఠం చెబుతారు : రాగిడి లక్ష్మారెడ్డి



ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి బృందం

**కుషాయిగూడ,జూలై 14 ప్రభాతవార్త :** సమస్యలను విస్మరించి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి పాదయాత్రల పేరిట కాలయాపన చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా డివిజన్లో బస్తీ సమస్యలపై విస్తృతంగా పర్యటించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గేటెడ్‌కమ్యూనిటీ కాలనీలకు జిహెచ్ఎంసి నిధులతో రోడ్లు డ్రైనేజీ పార్కుల నిర్మాణం చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని ఎమ్మెల్యే, కార్పొరేటర్ తీరును తీవ్రంగా ఖండించారు. గౌరీనాథపురంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేదని, కాప్రా చెరువు అభివృద్ధి లేని కారణంగా డ్రైనేజీ నీరు కలుషితమై విషపూరితంగా మారడంతో ప్రజల విష జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్ శివమణి ప్రజలకు అందుబాటులో లేకుండా ఫోన్లు ఎత్తని అతని పోకడపై కాంగ్రెస్ ఎస్సీ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చైర్మన్ పత్తి కుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కార్పొరేటర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, పెద్ది శ్రీనివాస్ గుప్తా, నాగశేషు, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సందీప్‌గౌడ్, హీరాలాల్, కృష్ణ, సాయిగౌడ్, బాలరాజుగౌడ్, వెంకట్‌గౌడ్, ముస్తాక్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌రావు ఆకాలమరణం విద్యాభివృద్ధికి తీరని లోటు : చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 14 ప్రభాతవార్త :** శ్రీ చైతన్య విద్యాసంస్థల అధిపతి బిఎస్‌రావు అకాల మరణం విద్యాభివృద్ధికి తీరనిలోటని అపోలో మెడికల్ అకాడమీ చైర్మన్ పోసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బిఎస్‌రావు మరణం పట్ల దిగ్ర్భాంతి వ్యక్తం చేస్తూ శుక్రవారం చైతన్యపురిలోని అపోలో మెడికల్ అకాడమీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రాలలో విద్యాభివృద్ధికి పాటుపడుతూ దేశవ్యాప్తంగా ఉన్నత విద్య కోసం ఎంత కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపక బృందం ఎం.గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్, సురేందర్‌గౌడ్, కెవిఆర్, రాజు, విద్యార్థిని విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందుల్లో ఉన్న వారికి అండగా ఉంటా: అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు అండగా ఉంటానని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఇటీవల భవనంపై నుండి కింద పడి గాయపడిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడకు చెందిన చిన్నారి శ్రేయను పరామరిశంచి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా తాను స్పందించి ముందుకు వస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, నాయకులు రామిడి శూరకర్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవికాంత్, పోరెడ్డి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20న డి వార్మింగ్ డే కార్యక్రమం

**ఎల్.బి.నగర్, జూలై 14 ప్రభాతవార్త :** ఈనెల 20వ తేదీన డి వార్మింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లావైద్యాధికారి డాక్టర్ వెంకటి ఆధ్వర్యంలో ఇంద్రధనస్సు, పొగాకు, డి అడిక్షన్ గురించి వివిధ ప్రభుత్వ శాఖలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి వార్మింగ్ డే సందర్భంగా 1నుండి 19సంవత్సరాలు నిండిన వారికి 400ఎంఎల్ ఆల్బెండజోల్ పాఠశాలలు, అంగన్వాడీకేంద్రాలు, ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తప్పనిసరిగా వైద్య, టీచర్ల సమక్షంలో సింగల్ డోస్ తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కింగ్ కోఠి హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ కళ, జిల్లా విద్యాశాఖ, మైనారిటీ వెల్ఫేర్, మెడికల్ ఆఫీసర్లు, లయన్స్‌క్లబ్ ప్రతినిధి కొట్టం జంగయ్యయాదవ్, విభాభారతి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

## శాకంబరీదేవిగా దుర్గా పరమేశ్వరి అమ్మవారు

**ఉప్పల్, జూలై 14 ప్రభాతవార్త :** అషాఢమాసం చివరి శుక్రవారం శ్రీ దుర్గా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృతాభిషేకం, శ్రీ సూక్త దుర్గాసూక్త విదానంతో అభిషేకం, అనంతరం అమ్మవారిని కూరగాయాలతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చన, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయంలో చివరి శుక్రవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

## బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు : శ్రీవాణి

**రామంతాపూర్, జూలై 14 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో బోనాల ఉత్సవాలకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆలయాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద సిసి రోడ్డు, బిటి రోడ్డు వేయాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయాల వద్ద మురుగునీరు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఆలయాల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి మంచినీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 30వ తేదీన ఫలహారం బండి ఊరేగింపు

**ఎల్.బి.నగర్, జులై 14 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ డివిజన్ విజయపురికాలనీలోని శ్రీ మైసమ్మ ఉత్సవ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం విజయపురికాలనీ అమ్మవార్ల గుడి నుండి ఖిల్లా మైసమ్మ దేవాలయంవరకు పోతరాజుల నృత్య విన్యాసాలు, వేషాలు. డప్పు వాయిద్యాలతో వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు గట్ల రవీంద్ర, దుర్గాప్రసాద్, తల్లాటి రమేష్, ఉన్న రమేష్, జేల్లా జగన్నాథం, ప్రధానకార్యదర్శి బండి మధుసూదన్ రావు, సలహాదారులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ప్రతినిధులు పి.కృష్ణారెడ్డి, కామినేని శ్రీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, సైదులు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులను మోసం చేసిన కెసిఆర్ : బోసుపల్లి

**తుర్కయంజాల్, జూలై 14 ప్రభాతవార్త :** బిజెపి దళిత మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మున్సిపాలిటీ దళిత మోర్చా ఆధ్వర్యంలో సెన్సార్ బోర్డ్ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర దళిత మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ కొండ్రు పురుషోత్తం, కౌన్సిలర్ బిజెపి ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలతఅనిల్‌కుమార్‌లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ దళితులను అన్ని విధాలుగా మోసం చేసారని, దళిత బంధు ఎంపికలో పక్షపాత వైఖరి అవలంభించారన్నారు. దళిత వృత్తిదారులైన చెప్పులు కుట్టేవారికి, డప్పు కొట్టేవారికి 5 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కార్యక్ర మంలో నాయకులు దాసు, ఎలిమినేటి నరసింహ రెడ్డి, అల్వాల్‌రెడ్డి, మల్లెల రమేష్‌బాబు, నరసింహ, కంభం శివకుమార్, నల్ల మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఎమ్మెల్యే బేతి పాదయాత్ర



పాదయాత్ర నిర్వహించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, జూలై 14 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ, శాంతినగర్, హనుమసాయికాలనీ తదితరప్రాంతాల్లో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులతో చర్చించి పలు సూచనలు చేశారు. గత పది రోజులుగా నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ సంఘం నేతలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు అరటికాయల భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి, లేతాకుల రఘపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, మస్కు సుధాకర్, సోమిరెడ్డి, జహంగీర్, మహిళా నాయకురాలు రాణిరెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరిగా దర్శనమిచ్చిన విజయదుర్గ



**సైదాబాద్,జూలై 14ప్రభాతవార్త:** ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకుని సైదాబాద్ మాతా మైదానంలోని శ్రీ విజయదుర్గ మాత ఆలయంలో అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని 20రకాల కాయగూరలు, పండ్లతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేయించారు. అమ్మవారిని దర్శించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

## సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లలలో కళాత్మక శక్తి పెరుగుతుంది : ప్రిన్సిపల్ రితిక

**కుషాయిగూడ, జూలై 14 ప్రభాతవార్త :** సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో మన సంస్కృతి అలవర్చుకోవడంతోపాటు వారిలో దాగి ఉన్న కళాత్మక నైపుణ్యం వెలికి తీయగలుగుతామని అక్షర ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్ రితిక పేర్కొన్నారు. బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ లో గల అక్షర ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థులు పోతరాజుల వేషధారణ అమ్మవారి బోనాల ఏర్పాటు ఘటం ఊరేగింపు ఇతర సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. కోణాల సంస్కృతిక కార్యక్రమాల లో విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ అలరించారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం: వేణుగోపాల్

**సైదాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** లింగోజిగూడడివిజన్ పరిధిలోని దీక్ష జూనియర్ కళాశాల విధ్యార్థులు రామాంతపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. స్మార్ట్ ఫోన్ల వాడకం గురించి, సైబర్ నేరాలు జరిగే తీరును గురించి విశ్రాంత పోలీసు అధికారి వేణుగోపాల్ విధ్యార్థులకు వివరించారు. నేరాలు జరిగినప్పుడు సంఘటనా స్థలాల్లో ఆధారాలను ఎలా సేకరిస్తారో విధ్యార్థులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ రాజు, శంకర్, సాయి, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విజయంకోసం కృషి చేయాలి



బట్టి విక్రమార్కను అభినందిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు

**మలక్‌పేట, జూలై 14 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ విజయంకోసం కృషి చేయాలని సిఎల్పీఅధ్యక్షుడు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ విజయంకోసం తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్రను విజయవంతంగా ముగించడంతో ఓల్డ్ మలక్‌పేటడివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ విక్రమార్కను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎంతో చరిత్ర ఉందని కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

## నాగోల్ గ్రామంలో 23న బోనాల ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, జులై 14 ప్రభాతవార్త :** నాగోల్ గ్రామంలో శ్రీ మహంకాళి, పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, కట్ట మైసమ్మ, ముత్యాలమ్మ, ఈదమ్మ ఇతర గ్రామదేవతల దేవాలయాలలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులు తెలిపారు. నాగోల్ శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం నాగోల్ బోనాల జాతరకు సంబంధించిన తేదీలను ఖరారు చేసి గ్రామపెద్దలు కరపత్రాలను ఆవిష్కరించారు. 20వ తేదీన శ్రీకంఠమహేశ్వరస్వామి బోనాలు, 23వ తేదీన శ్రీ మహంకాళి, పోచమ్మ, రేణుకఎల్లమ్మ, కట్ట మైసమ్మ, ముత్యాలమ్మ, ఈదమ్మ ఇతర గ్రామదేవతల బోనాల ఉత్సవాలు, 24వ తేదీన సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రకటించింది. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ, శ్రీమహంకాళి దేవస్థాన కమిటీ, శ్రీపోచమ్మ దేవస్థానం కమిటీ, నాగోల్ గ్రామ అభివృద్ధి కమిటీ, నవచైతన్య యువజన సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సబ్యులు పాల్గొన్నారు.

## దళితులపై వివక్ష చూపుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, జూలై 14 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులపట్ల వివక్ష చూపిస్తుందని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్రశాఖ పిలుపుమేరకు భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నినాదాలు చేస్తు అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం పెట్టి వందనం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన ఏ హామీ పూర్తి చేయలేదని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకుల పెత్తనాన్ని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు పాగ రాజేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, రమేష్ రెడ్డి, శ్రీకాంత్, నిరంజన్‌యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.